
పాఠశాలల్లో సదుపాయాలు కల్పించేందుకు కృషి

కేశంపేట, ఏప్రిల్ 22: ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల కల్పనకు రోటరీ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ కృషిచేస్తుందని సభ్యులు తెలిపారు. సోమవారం కేశంపేట లోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో పీఎస్ కేశంపేట, కొత్తపేట, ఎక్లాస్ ఖాన్‌పేట, కొండారెడ్డిపల్లి, యూపీఎస్ సంగెం, ఫరూఖ్‌నగర్ మండలం కిషన్ నగర్ పాఠశాలలకు రూ.1.32లక్షల విలువ చేసే లైబ్రరీ పుస్తకాలు, బీరువాలను అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో మనోహర్, ఎంఎన్‌వో చంద్రశేఖర్, క్లబ్ అధ్యక్షుడు మద్దులేటి, సభ్యులు జీఎస్.రెడ్డి, సతీష్‌రెడ్డి, వెంకటరావు, హరికొల్లారెడ్డి, శ్యాంరెడ్డి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



సభకు హాజరైన జనం

మేడ్చల్‌ను తీర్చిదిద్దుతా!

ఆంధ్రజ్యోతి, మేడ్చల్/శామీర్‌పేట ఏప్రిల్ 22: మేడ్చల్ జిల్లాలో పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు, ఐటీ హబ్‌లు ఏర్పాటు చేస్తామని, కోకాపేటలా మేడ్చల్ ప్రాంతాన్ని తీర్చిదిద్దే బాధ్యత తనపై ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం అంతాయపల్లిలో సోమవారం సాయంత్రం నిర్వహించిన జనజాతర సభలో సీఎం మాట్లాడారు. మేడ్చల్ ప్రజలు అభివృద్ధికి అండగా ఉండాలని, ఇక్కడి ప్రజలు నన్ను ఆదుకున్నట్లుగానే కాంగ్రెస్ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. జిల్లాలో అర్హులందరికీ తెల్లరేషన్ కార్డులు అందజేస్తామన్నారు. జిల్లాలో స్థిర పడిన వివిధ రాష్ట్రాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. జిల్లాలో దేవేందర్‌గౌడ్ హయాంలో చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంత సమస్యలపై కొట్లాడానని గత ప్రభుత్వ పెద్దల ఆటంకాలతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. జిల్లా ప్రజలు ఇచ్చిన ధైర్యంతోనే ఐదేళ్లుగా తాను వెనుదిరిగి చూడలేదన్నారు. జిల్లా ప్రజలు తనను కడుపులో పెట్టుకని ఎంపీగా గెలిపించి ఢిల్లీకి పంపిస్తే టీపీసీసీ అధ్యక్షుడినై నేడు ముఖ్యమంత్రిగా మీ ముందు నిలుచున్నానన్నారు. కేసీఆర్‌తో పోరాడెంత బలం ఇచ్చింది మల్కాజిగిరి ప్రజలేనన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. ఇక్కడ అభివృద్ధి లేనందునే కోకాపేటలో ఎకరానికి రూ. 100 కోట్లు పెరిగినట్లు ఇక్కడ భూముల రేట్లు పెరుగలేదన్నారు. ఇక్కడ పరిశ్రమలు స్థాపించి కోకాపేట వలే మేడ్చల్ ప్రాంతాన్ని తీర్చిదిద్దే బాధ్యత తనపై ఉందని, సునితారెడ్డిని గెలిపించాలని రేవంత్‌రెడ్డి కోరారు.



సభా వేదికపై నేతలు

ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందజేస్తాం : మంత్రి శ్రీధర్‌బాబు



అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డును ఇవ్వలేదన్నారు. ఈ ప్రాంతంలో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వైద్యారోగ్య శాఖ మంత్రిగా కొనసాగిన ఈటల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగార్చారని ఆరోపించారు. కులాల, మతాల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు దండుకోవాలని మోదీ విశ్వప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు మధుయాష్కీగౌడ్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యేలు మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మైనంపల్లి హనుమంత్‌రావు, కూన శ్రీశైలంగౌడ్, నాయకులు వజ్రేష్‌యాదవ్, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, సీపీఐ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జన జాతరకు పోటెత్తిన జనం

కలెక్టరేట్‌లో సునీతామహేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేసిన అనంతరం అంతాయపల్లిలో ఎన్నికల ప్రచారసభ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. జనజాతరకు సీఎం రేవంత్‌రెడ్డి విచ్చేయనుండటంతో జిల్లా నాయకులు జనాలను పెద్దఎత్తున తరలించారు. పార్టీ కార్యకర్తలతో సభా ప్రాంగణం జనసందోహంగా మారింది. సభాస్థలికి ప్రముఖ నాయకులు వచ్చే వరకు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆటపాటలతో ఉర్రూతలూగించారు.

అభివృద్ధికి పాటుపడతా

● ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి



ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంత అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, కేంద్రంలోనూ ఇదే పార్టీ గెలుపొందినచో పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తామన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేస్తానని ఆయనే అడ్రస్ లేకుండా పోయారని విమర్శించారు. కేసీఆర్ ఎన్ని ఇబ్బందులు పెట్టినా, అక్రమ కేసులు బనాయించినా ధైర్యంగా నిలబడి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి అభయ్‌కుమార్ పాటిల్

రాష్ట్రంలో బీజేపీకి 12 స్థానాలు

» మూడోసారి మోదీయే ప్రధాని

» బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి అభయ్‌కుమార్ పాటిల్

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 22: తెలంగాణలో 12 లోక్‌సభా స్థానాల్లో బీజేపీ విజయం సాధించబోతోందని కర్ణాటక ఎమ్మెల్యే, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్‌కుమార్‌పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. షాద్‌నగర్‌లో సోమవారం జడ్చర్ల, షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్ల బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అభయ్‌కుమార్ రెండు అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ పరిస్థితిపై సమీక్షించి, బీజేపీ విజయానికి కృషిచేయాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. రాష్ట్రంలోని 17 స్థానాల్లో 12 స్థానాలను బీజేపీ కైవసం చేసుకోబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశవ్యాప్తంగా బీజేపీకి అనుకూల వాతావరణం ఉందన్నారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు, అయోధ్యలో రామమందిర నిర్మాణం, 370 ఆర్టికల్, ట్రిపుల్ తలాక్ రద్దు వంటి ఎన్నో విప్లవాత్మక మార్పులు మోదీ తెచ్చారన్నారు. దేశవ్యాప్తంగా 400 లోక్‌సభా స్థానాలను బీజేపీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ సమావేశంలో అభయ్‌కుమార్ పిలుపునిచ్చారు.



ఉత్సవ మూర్తుల ఊరేగింపు

రమణీయంగా చిలుకూరు వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 22 : తెలంగాణ తిరుమలగా పేరుగాంచిన చిలుకూరు బాలాజీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు రమణీయంగా సాగుతున్నాయి. ఉత్సవాల ఐదోరోజు సోమవారం సాయంత్రం పండితులు మంత్రోచ్ఛరణల మధ్య శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర్లస్వామి వారల ఉత్సవమూర్తులకు వసంతోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో గజ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు చిలుకూరుతో పాటు సమీప గ్రామాల ప్రజలు తరలొచ్చారు. ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, ప్రధానార్చకులు సీఎస్.రంగరాజన్, కన్నయ్య, సురేష్, అనిల్, నాగరాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు. నేడు పల్లకీసేవ, రాత్రి రథోత్సవం నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు.

సీతారాముల కల్యాణ వైభోగం

ఘనంగా రాముల వారి పరిణయోత్సవం



శ్రీ సీతారాముల పరిణయ వేడుక

కడ్తాల్, ఏప్రిల్ 22 : మండల కేంద్రంలోని శ్రీ విజయ గణపతి, శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో సోమవారం సీతారామచంద్రుల కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ద్వితీయ బ్రహ్మోత్సవాలను ఆలయ నిర్వాహకుడు పోకల బస్వరాజ్-రాజమణి దంపతుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కడ్తాలతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు హాజరయ్యారు. వేదపండితులు అంగటి భువనేశ్వర్, జ్ఞానేశ్వర్, హరీశ్‌శాస్త్రి, రమణశర్మ, శ్రీధర్‌ల ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గుడూరు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు నర్సింహ, లక్ష్మీనర్సింహారెడ్డి, వేణుగోపాల్, చేగూరి వెంకటేశ్, బిచ్యానాయక్, బిక్యానాయక్, రాంచందర్, మోహన్‌రెడ్డి, విద్యాసాగర్, భగీరథ్, సరిత, భార్గవి, మౌనిక పాల్గొన్నారు.

నామినేషన్ల జోరు!

ఆంధ్రజ్యోతి, మేడ్చల్/ రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 22 : చేవెళ్ల, మల్కాజ్‌గిరి పార్లమెంటు స్థానానికి నామినేషన్ల జోరు ఊపందుకుంది. నాలుగో రోజు ఈ రెండు స్థానాలకు 22 నామినేషన్లు దాఖలయ్యాయి. చేవెళ్ల స్థానానికి మొదటి, రెండో రోజు ముగ్గురు చొప్పు అభ్యర్థులు నామినేషన్ వేశారు. మూడో రోజు ఆరు మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నాలుగోరోజు 11 మంది అభ్యర్థులు తమ నామినేషను జిల్లా ఎన్నికల అధికారి శశాంకకు సమర్పించారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నామినేషన్ వేయగా బీఆర్ఎస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నామినేషన్ వేశారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి నేడు బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలో మహేశ్వరం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలి వచ్చేందుకు సిద్ధమయారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ప్రజాఏక్తా పార్టీ అభ్యర్థిగా ఎస్. రాజుగౌడ్, స్వతంత్ర అభ్యర్థులుగా జి మల్లేశంగౌడ్, మహ్మద్ అఫ్సర్‌ఖుద్దూస్, అమీర్ సాజిద్, వి పాండు, కె. శ్రీనివాస్ నామినేషన్ వేశారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) పార్టీ అభ్యర్థిగా మహ్మద్ సలీం, ఆలీండియా మజ్లీస్ ఈ- ఇంక్యూలబ్-ఇ-మిలాట్ ఏఐఎంఐఎం(ఐఎన్‌క్యూ) పార్టీ నుంచి మహ్మద్ అబ్దుల్, ఖ్యావి అబ్బాసి, ధర్మసమాజ్‌పార్టీ అభ్యర్థిగా తోట్ల రాఘవేందర్ నామినేషన్ దాఖలు చేశారు.



నామినేషన్ సమర్పిస్తున్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

» నాలుగో రోజు 22 నామినేషన్లు దాఖలు

» బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి దాఖలు



నామినేషన్ సమర్పిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్



నామినేషన్ దాఖలు చేస్తున్న సునీతా మహేందర్‌రెడ్డి

మల్కాజ్‌గిరి స్థానానికి 11 నామినేషన్లు

మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియలో భాగంగా సోమవారం 4వ రోజు 11 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పట్నం సునీతామహేందర్ రెడ్డి రెండు సెట్ల నామినేషన్లు, బీజేపీ నుంచి ఈటల రాజేందర్, రాష్ట్ర సామాన్య ప్రజాపార్టీ అభ్యర్థిగా అప్పారావు, స్వతంత్ర అభ్యర్థులుగా అంతోని డేవిడ్, పాలది పవన్‌కుమార్, పెండ్యాల శేషసాయి వరప్రసాద్, కంటే సాయన్న, బేగారి లోకేష్, భారత సుదర్శన్, మహమ్మద్ అక్బర్‌తో కలిపి మొత్తం 11 నామినేషన్లు వేశారు. ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలు స్వీకరించినట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతం తెలిపారు. కాగా, మల్కాజ్‌గిరి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌లతో కలిసి సునీతామహేందర్‌రెడ్డి తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. అంతకుముందు బంజారాహిల్స్ హనుమాన్ ఆలయంలో పట్నం దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆముదాల చెరువు ఎఫ్‌టీఎల్‌లో వెంచర్?

» మట్టిపోసి చదును చేయిస్తున్న రియల్టర్లు » గొల్లూరు చెరువు కనుమరుగేనా?



ఎఫ్‌టీఎల్‌లో మట్టి పోయిస్తున్న వ్యాపారులు

మహేశ్వరం, ఏప్రిల్ 22 : చెరువు, కుంటల పరిరక్షణ, ఎఫ్‌టీఎల్ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం ఎన్ని చట్టాలు రూపొందించినా కొందరు రియల్టర్లు వెంచర్లు చేస్తున్నారు. మహేశ్వరం మండలం గొల్లూరులోని ఆముదాల చెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టితో చదును చేస్తున్నారు. చెరువు మొత్తం 42 ఎకరాలుండగా 10 ఎకరాలకుపైగా ఎఫ్‌టీఎల్‌లో పట్టాభూమి ఉంది. రైతు గోపయ్య తదితరుల పేర్లతో ఉన్న ఈ ఎఫ్‌టీఎల్ భూములను కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కారుచౌకగా కొన్నారు. ఇక్కడి భూములకు ఎకరం రూ.6కోట్ల ధర ఉంది. కొన్న ఎఫ్‌టీఎల్ భూమిలో రాత్రికి రాత్రి టిప్పర్లతో మట్టి నింపుతూ చదును చేస్తున్నారు. ఎఫ్టీఎల్‌లో వెంచర్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. చెరువు నిండితే ఎఫ్‌టీఎల్ పరిధి పదెకరాలూ మునుగుతుంది. భూమి కొన్న రియల్టర్లు చదునుచేసి అమాయకులకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి ఆముదాల చెరువును రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా ఈ అంశంపై నీటిపారుదల శాఖ ఏఈ గోవింద్ స్పందిస్తూ గొల్లూరులోని ఆముదాల చెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టిపోసినా, నిర్మాణాలు చేపట్టినా వాటిని తొలగిస్తామన్నారు. ఎఫ్టీఎల్‌లో పట్టా భూములు ఉన్నా అవి తేలినప్పుడు వ్యవసాయం మాత్రమే చేసుకోవాలని గానీ ఎలాంటి నిర్మాణాలు, వెంచర్లు, ఇతర వాణిజ్య కార్యకలాపాలు చేపట్టవద్దని తెలిపారు. పోసిన మట్టిని వారం రోజుల్లో తొలగించకుంటే మట్టిపోసిన వారికి నోటీసులు జారీచేస్తామన్నారు. అలాగే ఎఫ్‌టీఎల్‌ను తాజాగా సర్వే చేసి హద్దులు పాతుతాం అని, ఎఫ్‌టీఎల్‌లో మట్టి పోయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని ఏఈ తేల్చి చెప్పారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం

● వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఏప్రిల్ 22: 2023-24 యాసంగి సీజన్‌లో రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించేందుకు కొనుగోలు కేంద్రాలు అన్ని సిద్ధంగా ఉన్నట్లు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. సివిల్ సప్లయ్ కమిషనర్ సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయ్ అధికారులతో మాట్లాడారు. జిల్లాలో 129 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ మొదటి వారంలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లా మొత్తం 1,19,350 అంచనా ప్రకారం మెట్రిక్ ధాన్యం వస్తుందని తెలిపారు. ఇట్టి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేయడానికి ముందస్తుగానే వరి పంటకు కనీస మద్దతు


మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ధర క్వింటాలుకు గ్రేడ్ ఏ రకానికి రూ.2203, సాధారణ రకానికి రూ.21883 చెల్లించి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ ఉన్నారు.

ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 22: విద్యారంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను అనురాగ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మహిపతి శ్రీనివాస్‌రావుకు ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు వరించింది.



శ్రీనివాస్‌రావుకు ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం చేస్తున్న పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి

నగరంలోని నిర్వహించిన ఓ కార్యక్రమంలో సోమవారం ఆంధ్రా యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి, ఏఐసీటీఈ చీఫ్ కో-ఆర్డినేటర్ బుద్దా చంద్రశేఖర్, బ్రెన్‌ఈ విజన్ సీఈవో గణేష్‌నాగ్ చేతుల మీదుగా శ్రీనివాస్‌రావుకు ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం చేశారు. విద్యాపరిశోధన రంగంలో చేసిన విశేషకృషికి గాను జాతీయస్థాయిలో ఈ అవార్డు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా అనురాగ్ యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమ, రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల, అయా విభాగాధిపతులు శ్రీనివాస్‌రావును అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ నవ్ కంపెనీ డైరెక్టర్ భాస్కర్, చితో హెల్త్‌కేర్ సీఈవో ఎస్వీ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టు కార్డుల ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న మహేశ్‌రెడ్డి

హామీల అమలుకు బీఆర్‌ఎస్ పోస్టుకార్డు ఉద్యమం

పరిగి, ఏప్రిల్ 22 : కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నేరవేర్చాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపించే ఉద్యమాన్ని సోమవారం వికారాబాద్ జిల్లా పరిగిలో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందుకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలైన రెండు లక్షల రుణమాఫీ, రూ.15 వేల రైతు భరోసా, వరికి రూ.500బోనస్, రైతుకూలీలకు రూ.12వేలు, వృద్ధులకు రూ.4వేల పించన్, మహలక్ష్మీ కింద మహిళలకు రూ.2500 తదితర హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలల్లోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కే ఓట్లు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైఎస్ చైర్మన్ భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు అంజనేయులు, ఎంపీటీసీ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి, పీరంపల్లి రాజు, టి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మాణిక్యం, సంతోష్, రవికుమార్, అసీఫ్, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

ఓటు హక్కును వినియోగించుకోవాలి

మేడ్చల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 18 సంవత్సరాలు నిండిన ప్రతీఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాజాత బృందాల ఆధ్వర్యంలో ఓటర్లకు సోమవారం మేడ్చల్‌లో అవగాహన కల్పించారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'నీ ఓటు-నీ భవిష్యత్తు' అని ఓటర్లకు అవగాహణ కల్పించారు. ఓటు ప్రాముఖ్యత గురించి వివరించారు. గతంలో అత్యల్ప ఓటింగ్ నమోదైన ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం అసెంబ్లీ పరిధిలో నిజాంపేట్, బాలానగర్, కుత్బుల్లాపూర్, మేడ్చల్ అసెంబ్లీ పరిధిల్లో కళాజాత బృందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి.

సొంత నిధులతో గ్రంథాలయం ఏర్పాటు అభినందనీయం

- ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎడిటర్ శ్రీనివాస్, ప్రొఫెసర్ కోదండరాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్

కొడంగల్‌రూరల్, ఏప్రిల్ 22: మారుమూల గ్రామంలో సొంత నిధులతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎడిటర్ కే.శ్రీనివాస్ అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని సంగాయిపల్లి గ్రామ పంచాయతీలో రిటైర్డ్ హెచ్‌ఎం హన్మయ్య తన తల్లిదండ్రులు శివమ్మ-అచ్చప్ప స్మారకార్థం రూ.30 లక్షలు సొంత నిధులతో నిర్మించిన గ్రంథాలయ భవనం, శివమ్మ విగ్రహాన్ని ప్రొఫెసర్ కోదండరాంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రిటైర్డ్ హెచ్‌ఎం హన్మయ్య ఉద్యోగ నిర్వాహణలో ఎంతో సేవలు అందించి, పదవీ విరమణ అనంతరం స్వగ్రామంలో ఆలయ నిర్మాణంతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ తాజాగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు మాత్రమే చదువుకుంటారని, గ్రంథాలయాల్లో వయస్సుతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరూ జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలోని గ్రంథాలయాల్లో పోస్టులను భర్తీ చేయక పోవడంతో పాటు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. రిటైర్డ్ హెచ్‌ఎం హన్మయ్య గ్రంథాలయ ఏర్పాటుతో పాటు విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరపడే పుస్తకాలు, రైతులకు నూతన పద్దతుల్లో వ్యవసాయంపై సలహాలు, సూచనల కోసం పుస్తకాలను ఉంచడంతో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ప్రజలను మేలుకొలిపే జాగ్రత జ్యోతులుగా, సామాజిక విజ్ఞాన కేంద్రాలుగా, సాంఘిక ఉద్యమాలకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడ్డాయన్నారు. అలాంటి గ్రంథాలయాలు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పీఏసీఎస్ చైర్మన్ కటకం శివ కుమార్‌గుప్త, భాస్కర్, రెడ్డి శ్రీనివాస్, రవీందర్‌గౌడ్, సోమశేఖర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటున్న మోదీ



తరలివస్తున్న కార్యకర్తలు

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 22 : ప్రధాని నరేంద్ర మోదీ దేశాని రక్షిస్తూ.. పేదలను ఆదుకుంటున్నారని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఆయన నామినేషన్ దాఖలు చేశారు. కాళీమందిర్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని అక్కడ నుంచి ర్యాలీగా రాజేంద్ర నగర్ తహసీల్దారు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథకంలో తీసుకువెళుతున్నారని, ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయన్నారు. తెలిపారు. కరోనా లాంటి వ్యాధులు వచ్చినా, యుద్ధం వచ్చినా ఎదుర్కొనే స్థితిలో దేశం ఉందన్నారు. మోదీ పాలనలోనే స్వచ్ఛభారత్ ఇంటింటికి మరుగుదొడ్డి కట్టించినట్లు చెప్పారు. దేశం ఆర్థికాభివృద్ధి సాధించినట్లు చెప్పారు. మోదీ అంటేనే నమ్మకమన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీగా ఉండి దిగజారి పోయిందన్నారు. ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు కావని చెప్పారు. ఎన్నికల కోసమే ఆ గ్యారంటీలను తీసుకువచ్చారని విమర్శించారు. 2047 వరకు ఏం చేయాలన్నది బీజేపీ మేనిఫెస్టోలో మోదీ ముందే నిర్ణయించారని తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్రంలో ఒక మాట, ఢిల్లీలో మరోమాట చెబుతున్నదని ఎద్దేవా చేశారు. బీజేపీ టికెట్ రావడం తన అదృష్టమని, తాను ప్రతి గ్రామంలో ప్రతి గడపకు వెళ్లినట్లు చెప్పారు. తాను టీఆర్‌ఎస్‌లో ఉన్నప్పుడు కూడా వేల కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశానన్నారు. బీజేపీ పార్టీకి ఓటేసి తనను భారీ మెజారిటీతో ఎంపీగా గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే.. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం సాధ్యం కాని హామీలిచ్చింది

కాంగ్రెస్ ప్రభుత్వం సాధ్యం కాని హామీలిచ్చిందని ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలు, ఇచ్చిన హామీలు అబద్ధమన్నారు. పంద్రాగస్టు వరకు రూ. 2 లక్షల రుణాలు మాఫీ చేస్తానని సీఎం చెప్పారని, ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో లేదన్నారు.

బీఆర్‌ఎస్ మురిగి పోయింది: కేఎస్ రత్నం

టీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్‌గా మారినప్పుడే ఆ పార్టీ మురిగి పోయిందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. రాజకీయ లబ్ధి కోసం రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, స్పోక్ పర్సన్ రాణి రుద్రమదేవి, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, వికారాబాద్ అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, అంజన్ కుమార్, ప్రహల్లాద్‌రావు, అందెల శ్రీరాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



కులకచర్ల నుంచి చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి నామినేషన్‌కు వెళ్తున్న బీజేపీ నాయకులు

నామినేషన్‌కు తరలిన బీజేపీ నాయకులు

కులకచర్ల, ఏప్రిల్ 22: చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కులకచర్ల నుంచి బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రహ్లాద్‌రావు ఆధ్వర్యంలో సోమవారం నామినేషన్‌కు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటయ్యగౌడ్, సౌమ్యరెడ్డి, మహిపాల్, సురేశ్ పాల్గొన్నారు.

పరిమితి దాటొద్దు.. చిక్కుల్లో పడొద్దు



- ప్రారంభమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ
- నామినేషన్ రోజు నుంచే ఖర్చు లెక్క
- అభ్యర్థి ఖర్చు రూ.95లక్షలకే పరిమితం
- పరిశీలించనున్న వ్యయ పరిశీలకులు

తాండూరు, ఏప్రిల్ 22: ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయింది. నామినేషన్ల ప్రక్రియ వేగం పుంజుకుంది. దీంతో పోటీలో నిలిచే అభ్యర్థుల ఖర్చు ఇప్పటి నుంచే లెక్కించబడుతుంది. 25రోజుల పాటు ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. వ్యయ పరిశీలకుల బృందం నిఘాను పెంచుతాయి. ఎవరెంత ఖర్చు చేస్తున్నారో లెక్కగడుతూ వీడియో తీస్తారు. చేవెళ్ల పార్లమెంటు యూనిట్‌గా వ్యయ పరిశీలకులను కేంద్ర ఎన్నికల సంఘం నియమిస్తోంది. నియోజకవర్గాల వారీగా పరిశీలన కేంద్రాలున్నాయి. ఖర్చు విషయంలో అభ్యర్థులు హద్దులు దాటకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఎన్నికల ప్రవర్తన నియామళిని 1951లో రూపొందించారు. ఏఅభ్యర్థి ఎంత మేర ప్రచారానికి ఖర్చు చేయాలని నిర్దేశిస్తూ సెక్షన్ 19లో వివరించారు. ఎన్నికల సమయంలో ధరలకు అనుగుణంగా వాటిని వెల్లడిస్తారు. 2018 ఎన్నికల సందర్భంగా వ్యయాన్ని సవరించగా అప్పటి వ్యయమే ప్రస్తుతముంది. అసెంబ్లీ అభ్యర్థికి రూ.40లక్షలు ఉండగా పార్లమెంటు అభ్యర్థికి రూ.90లక్షలుగా నిర్ణయించారు. పోటీలో నిలబడే అభ్యర్థులు ఈసీఐ వ్యయ పరిమితి దాటి ఖర్చు చేసినా, వాటికి సంబంధించిన లెక్కలు సరైన ఆధారాలతో సమర్పించకున్నా అభ్యర్థులపై వేటు పడుతుంది.

నామినేషన్ దాఖలైనప్పటి నుంచే లెక్క

ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకు ఖర్చును లెక్కిస్తారు. ఇందుకు కోసం అభ్యర్థి ఎదైన జాతీయ బ్యాంకులో నూతన ఖాతా తెరవాలి. ఈ లావాదేవిలు ఈ ఖాతా ద్వారానే జరుగాలి. ప్రత్యేక అడిటర్లు వివరాలన్ని నమోదు చేస్తారు. నామినేషన్ల కంటే ముందు ఖర్చులను ప్రధాన పార్టీలుంటే ఆ పార్టీల ఖాతాలో జమ చేస్తారు.

షాడో రిజిష్టర్‌లో నమోదు

ఎన్నికుర్చీలు, టెంట్లు, సెట్లు వేశారు. ఎన్నివాహనాలు వినియోగించారు. ఎంత మందికి భోజనాలు ఏర్పాటు, ఫంక్షన్‌హాల్, వంటి వివరాలను తనిఖీ బృందాలు షాడో రిజిష్టర్‌లో నమోదు చేస్తారు. వ్యయ పరిశీలకుల ఆధ్వర్యంలో వివరాల సేకరణ ఉటుంది. స్థానికంగా ఉన్న ధరల ప్రకారం ఖర్చును లెక్కగడతారు. కల్యాణ మండపాలు, మహరాజ్, వీఐపీ కుర్చీ, వీడియోగ్రఫీ, ఎల్‌సీడీ తెరలు, చికెన్ బిర్యానీలు, శాఖాహార భోజనం, జనరేటర్, డ్రోన్ కెమెరా, పులిహోరా, సమోసా, వస్త్రం జెండాలు, ఫ్లెక్సీ బ్యానర్, మైకులు, డీజేలు, వాహన లైన్ జీపులు, ఆటోలు, లారీలు, టెంపో, మినీ బస్, డీసీఎం వ్యాన్, ట్రాక్టర్స్ వంటి వాటి ధరలను ఎన్నికల రిటర్నింగ్ ఆధ్వర్యంలో నిర్ణయిస్తారు.



మాట్లాడుతున్న షాద్‌నగర్ ఆర్డీవో

ఓటరు స్లిప్పుల పంపిణీలో అప్రమత్తంగా ఉండాలి

- షాద్‌నగర్ ఆర్డీవో వెంకట మాధవరావు

కేశంపేట, ఏప్రిల్ 22 : ఓటరు స్లిప్పుల పంపిణీలో బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలని షాద్‌నగర్ ఆర్డీవో వెంకట మాధవరావు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సెక్టోరల్ ఆఫీసర్లు, బీఎల్వోలకు ఓటరు స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయలపై అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో మూత్రశాలలు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండ పటిష్ట చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కేశంపేట తహశీల్దార్ మీర్ అజాంఅలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఫరూఖ్ నగర్ మండల వ్యవసాయదికారి నిశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూతుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న తహశీల్దార్

కొందుర్గు, ఏప్రిల్ 22 : పోలింగ్ బూతుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని తహశీల్దార్ రమేష్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో లోక్‌సభ ఎన్నికల సెక్టార్ అధికారులు, బిఎల్‌వో సూపర్‌వైజర్లు, బిఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 26 పోలింగ్ బూతులకు సంబంధించిన వివరాలను సేకరించారు. ప్రతి బూతులో 85 సంవత్సరాలు దాటిన సీనియర్ సీటిజన్స్ వివరాలను సేకరించాలని, వారికి ఇంటి వద్దనే ఓటు వేసే సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ అంజనేయులు, సెక్టార్ అధికారులు ప్రవీణ్‌కుమార్, ఫసియా, సూజాత, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మతాల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ

అభివృద్ధికి పాటుపడే కాంగ్రెస్‌ను గెలిపించండి ▸ ఎన్నికల ప్రచారంలో రంజిత్‌రెడ్డి

పెద్దేముల్, ఏప్రిల్ 22: బీజేపీ విద్వేషాలు రగిలించి మతాల మధ్య చిచ్చు పెడుతోందని చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని గొట్లపల్లి, తట్టెపల్లి గ్రామాల్లో సోమవారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా గొట్లపల్లిలో వారిని పార్టీనాయకులు ఎడ్లబండ్లపై ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకెళ్లారు. అక్కడ గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రంజిత్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ మాటిస్తే తప్పదని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందన్నారు. ఇచ్చిన ఆరుగ్యారంటీల్లో అన్నింటినీ ప్రజలకు అందిస్తుందని చెప్పారు. త్వరలోనే 15ఆగస్టుకు రైతుల రుణమాఫీకూడా జరుగుతుందని చెప్పారు. 10 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మార్చి నుంచి 200 యూనిట్లలోపు కరెంటు బిల్లులు ఎవరూ చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తుందని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ ధారాసింగ్, రాష్ట్ర ఓబీసీసెల్ కన్వీనర్ సునితాసంపత్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, వైస్‌ఎంపీపీ మధులత, ఎంపీటీసీ లొంకనీలు, నాయకులు రాకేష్, లొంకనర్సిములు, నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

పరిగి: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి జి.రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి సతీమణి సీతారంజిత్‌రెడ్డి, టీఆర్‌ఆర్ సతీమణి టి.ఉమారెడ్డిలు కోరారు. పరిగి మునిసిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో సోమవారం వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాలమూరు, చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టులు కట్టకుండా ఉమ్మడి జిల్లాకు తరని అన్యాయం చేసిన కేసీఆర్ ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డికి పరిగి నుంచి రూ.50వేల మెజారిటీని ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, కడ్మూరీ ఆనందం, మాజీ ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌గుప్త, జిల్లా కార్యదర్శి కె.హనుమంత్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, మండల అధ్యక్షుడు బి.పరుశురాంరెడ్డి, ఆనెం అంజనేయులు పాల్గొన్నారు.

ఎన్కెపల్లిలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

పూడూరు: మండలంలోని ఎన్కెపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నాయకులు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆనందం, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.



పెద్దేముల్: గొట్లపల్లిలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ నాయకులు

పరిగి: పూడూరు మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పూడూరు మండలం బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, అనంతరెడ్డి, మంచన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, బీఎస్పీ కార్యకర్తలు ఆ పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు.

తాండూరు రూరల్: చిట్టిఘనాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ మంజురానితో పాటు సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శాంత్‌కుమార్, పీపుల్స్ కళాశాల ఉపన్యాసకులు వెంకట్‌రాములు గౌడ్ తదితరులు సోమవారం తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జర్నె నాగప్ప, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉత్తంచంద్, రామచంద్రారెడ్డి, మున్నూరు శేఖర్, అశోక్ పాల్గొన్నారు.

దోమ: బడేంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కవిత శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీలో చేరిన వారికి కండువాలతో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దోమ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాలి విజయ్ కుమార్‌రెడ్డి, బడేంపల్లి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అందరికీ న్యాయం

షాబాద్: కాంగ్రెస్‌తోనే అందరికీ సమన్యాయం జరుగుతుందని, దేశంలో ఇందిరమ్మ రాజ్యం తీసుకొద్దామని టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అప్పారెడ్డిగూడ, లింగారెడ్డిగూడ, మన్‌మర్రి, బోడంపహాడ్ గ్రామాల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, చేవెళ్ల ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు అనితారెడ్డి, మల్లేష్, ఎంపీటీసీ అశోక్, అశ్విని పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

చేవెళ్ల: సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని చేవెళ్ల, ముడిమ్యాల్ ప్యాక్స్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో వారు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, బండారు శైలజ, గంగి యాదయ్య, వీరేందర్‌రెడ్డి, దేవర సమతరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చర్యలు

యాచారం, ఏప్రిల్ 22 : ఏ ఒక్క గ్రామంలో ప్రజలకు తాగు నీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ తాగు నీటి పైప్‌లైన్లు లీక్ కాకుండా చూడాలన్నారు. తాగు నీటి పైప్‌లైన్ లీకైతే వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. వారం వారం విధిగా ఓహెచ్ఎస్ఆర్ టాంకులను శుభ్రం చేయించాలని సూచించారు. మురుగు కాలువలు విధిగా శుభ్రం చేయాలన్నారు. వంద శాతం పన్నులు వసూలు చేయాలని చెప్పారు. ప్రతి గ్రామంలో వంద శాతం ఉపాధి పనులు చేయించాలని ఆదేశించారు. పని ప్రదేశంలోనే కూలీలకు తాగునీటితో పాటు మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలన్నారు. హరితహారం నర్సరీని ప్రతి రోజు సందర్శించి మొక్కలు వాడిపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ఉమారాణి, ఏపీవో లింగయ్య, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితేనే ఉత్తమ ఫలితాలు



సోమనాథశర్మను అభినందిస్తున్న సాత్వికరెడ్డి

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 22 : విద్యార్థులు కష్టపడితేనే ఉత్తమ ఫలితాలు తప్పకవస్తాయని, విద్యతో పాటు పరిశోధనలపై శ్రద్ధ పెట్టి భవిష్యత్తులో ప్రయోజకులుగా ఎదిగేందుకు కృషి చేయాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్విక రెడ్డి అన్నారు. హిమాయత్ నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన సోమనాథశర్మ అనే విద్యార్థి భౌతికశాస్త్రంలో 'ఏ స్టడీ ఆన్ రేడియేషన్ ఇండ్యూస్ మోడిఫికేషన్ ఆఫ్ ఫిజికల్, కెమికల్ ప్రాపర్టీస్ ఆఫ్ సమ్ పాలిమర్‌బేస్డ్ మెటీరియల్ అండ్ దెయిర్ స్టెబిలైజేషన్ యాసెక్ట్' అనే అంశంపై ప్రొఫెసర్ రాజు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. అదే విధంగా అశోక్ అనే విద్యార్థి గణితశాస్త్రంలో 'న్యూమెరికల్ ట్రీట్మెంట్ ఆఫ్ కన్వెక్టివ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్ఫర్ ఆఫ్ నాన్-న్యూటోనియన్ ఫ్లూయిడ్ ఫ్లో' అనే అంశంపై ప్రొఫెసర్ సుందర్ రావు, మహ్మద్ షమీ షద్దీన్‌ల పర్యవేక్షణలో పరిశోధనలు చేశారు. వీరిద్దరిని సోమవారం సాత్వికరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, జగదీశ్వర్, క్రిష్టోఫర్, అధ్యాపకులతో పాటు పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒకరి నేత్రదానంతో ఇద్దరికి దృష్టి భాగ్యం

ఆమనగల్లు , ఏప్రిల్ 22 : ఒకరి నేత్ర దానంతో ఇద్దరికి దృష్టి భాగ్యం కలుగుతుందని లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ నటరాజ్ యాదయ్య అన్నారు. ప్రతీ ఒక్కరు మరణానంతరం నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని ఆయన కోరారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్‌కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర సంరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఆర్‌వో ఎం.ఏ పాషా, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి కొరివి వెంకటయ్య, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రహరీ ఎత్తు పెంచాలి

తలకొండపల్లి , ఏప్రిల్ 22 : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రహరీ ఎత్తు పెంచాలని మాజీ ఉపసర్పంచ్, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ పద్మ అనిల్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో శ్రీకాంత్ కు వినతి పత్రం అందజేశారు. పక్కనున్న రోడ్డు ఎత్తు పెంచడంతో పాఠశాల ఆవరణ, ఆట స్థలం బయటకు కనిపిస్తుండడంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సాయిరామ్, గణేశ్, రాజు, మశ్చందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్



మాట్లాడుతున్న భాస్కర్‌యోగి

చేవెళ్ల, ఏప్రిల్ 22 : విద్యతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ప్రముఖ వక్త డాక్టర్ భాస్కర్ యోగి అన్నారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన భాస్కర్‌యోగి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని లక్ష్యం దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, డైరెక్టర్లు ఇంద్రసేనారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

చేవెళ్ల, ఏప్రిల్ 22 : వేసవిలో ప్రజలందరు జాగ్రత్తలు తీసుకోవాలని వివేకానంద ఇంటర్‌నేషనల్ స్కూల్ వైస్‌ప్రిన్సిపాల్ వేణుకుమార్, పాఠశాల దిశానిర్దేశకుడు హరి సూచించారు. పాఠశాల చివరి రోజు సందర్భంగా మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయం చౌరస్తాలో ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎండలు అధికంగా ఉన్నాయని అవసరం ఉంటేనే ఇంట్లో నుంచి బయటకు రావాలన్నారు. మేనేజర్ నరేశ్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

ఆమనగల్లు, ఏప్రిల్ 22 : మండల పరిధిలోని గౌరారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగే వేడుకలకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. దేవాలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు గణపతి, వాస్తు పూజలు, రుత్విక్ వరణం, అంకురారోహణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నిట్ట మంగమ్మనారాయణ, మాజీ సర్పంచ్ రజితశ్రీనివాస్‌రెడ్డి, నిర్వాహకులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా వేంకటేశ్వర స్వామి విగ్రహం పునః ప్రతిష్ఠ

కందుకూరు : మండలంలోని లేమూరు గ్రామంలో సోమవారం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేదపండితులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ధ్వజ స్తంబ ప్రతిష్ఠ చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తులకు పూజలు చేశారు. రక్షాబంధనం, మృతికాసనం, ద్వార తోరణం, స్వామి వారి యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజకుంభారాధన, జలక్షీరాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు పూజా కార్యక్రమాల జరుగనున్నాయి. ప్రతిరోజు భక్తులకు అన్నదానం కార్యక్రమాలుంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నేడు వేంకటేశ్వరుడి రథోత్సవం

షాద్‌నగర్అర్బన్ : షాద్‌నగర్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు (మంగళవారం) ఉదయం రథోత్సవాన్ని నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి రథానికి సోమవారం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మరమ్మతులు చేయించారు. మంగళవారం వేకువజామున రథాంగహోమం, రథబలి అనంతరం రథోత్సవాన్ని నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ముందుగా రథం ఆలయం చుట్టూ తిరిగి అనంతరం పాత జాతీయ రహదారి మీదుగా కాలేజీ రోడ్డు, మెయిన్ రోడ్డు, వినాయక గంజ్, మీదుగా తిరిగి పరిగి రోడ్డు, నాగులపల్లి రోడ్డు, ఫరూఖ్‌నగర్ మీదుగా ఆలయానికి వచ్చేటట్లు ఏర్పాటు చేస్తున్నారు.

దేశంలో బీజేపీపై ప్రజా వ్యతిరేకత

ఆమనగల్లు, ఏప్రిల్ 22 : దేశంలో బీజేపీపై ప్రజా వ్యతిరేకత ఉందని, దాన్ని గమనించి ప్రధాని మోదీ అసహనంతో మాట్లాడుతున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి అన్నారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశ ప్రజల సంపదను ముస్లింలకు పంపిణీ చేస్తుందని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్త చేశారు. మతం, రామాలయ నిర్మాణం పేరిట బీజేపీ నీచ రాజకీయాలకు ఒడిగట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజారంజక పాలన చూసి బీజేపీ, బీఆర్ఎస్ జీర్ణించుకోలేక పోతున్నాయని అన్నారు. కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ అభ్యర్థిగా తాను నేడు (మంగళవారం) నామినేషన్ వేస్తున్నట్లు, సాయంత్రం 4 గంటలకు బిజినేపల్లి వద్ద నిర్వహించే బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు మల్లు రవి తెలిపారు. సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీలు కమ్లీమోత్యనాయక్, అనితవిజయ్, పద్మారెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణరెడ్డి, రవి

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తోడ్పాటు

తలకొండపల్లి : విద్య, ఉపాధి కల్పనకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటునందిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం కర్కాస్ తండా సమీపంలో మాజీ సర్పంచ్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్‌డీపీఈ పైప్ ఇండస్ట్రీని స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. వెంకటాపూర్‌లో జరిగిన జూలపల్లి ఎంపీటీసీ సునిత భర్త సుదర్శన్‌రెడ్డి సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశ రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు బీచ్యానాయక్, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగా రెడ్డి

యాచారం, ఏప్రిల్ 22 : కాంగ్రెస్ బలోపేతానికి తమ పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని, భువనగిరి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకునేందుకు చొరవ తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కార్యకర్తలకు సూచించారు. సోమవారం మండలంలోని మంతన్‌గౌరెల్లికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో కారింగ్‌యాదయ్య, సోమయ్య, యదగిరి, కడారి రాజు, కిషన్, అఖిల్ తదితరులు ఉన్నారు. మాజీ ఎంపీటీసీ కొర్ర అరవింద్‌నాయక్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన యువకులతో మల్‌రెడ్డి

ప్రజా భవన్‌లో అందుబాటులో ఉంటా

ఇబ్రహీంపట్నం : ఇక నుంచి ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజా భవన్‌లో అందుబాటులో ఉంటానని, ఎవరైనా నేరుగా వచ్చి సమస్యలు చెప్పొచ్చని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక సోమవారం తొలిసారిగా క్యాంపు కార్యాలయంలో అడుగుపెట్టారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులు పూజలు నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, జడ్పీటీసీ భూపతిగళ్ల మహిపాల్, ఎమ్మెల్యే తనయుడు అభిషేక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంద్రారెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 22 : మాజీ మంత్రి ఇంద్రారెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని, పట్లోళ్ల కుంటుంబానికి రాజకీయ జీవితం ఇచ్చిన చేవెళ్ల ప్రజలకు తుదిశ్వాస వరకు సేవ చేస్తామని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. దివంగత ఇంద్రారెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా సోమవారం మండల పరిధిలోని కౌకుంట్లలోని ఆయన సమాధిపై పూలు వేసి కుటుంబ సభ్యులు కార్తీక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, కళ్యాణ్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, పలువురు నాయకులతో కలిసి సబితారెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంద్రారెడ్డి ప్రజల్లో చెరగని ముద్రవేసుకున్నారని చెప్పారు. తమ కుటుంబంపై చేవెళ్ల ప్రజలు చూపిస్తున్న ఆదరణను ఎప్పటికి మర్చిపోమన్నారు. అనంతరం అక్కడికి వచ్చిన వారందరికీ అన్నదానం చేశారు. అంతకు ముందు మండల కేంద్రంలోని ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణరెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, జడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, టీఆర్ఎస్‌కెవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, మాజీ ఎంపీపీ. బాల్‌రాజ్, వైఎస్ ఎంపీపీ. కర్నె శివప్రసాద్, వివిధ మండలాల నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.



చేవెళ్ల: ఇంద్రారెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న సబితారెడ్డి, తదితరులు

శంషాబాద్ రూరల్ : మండల పరిధిలోని పాల్మాకులలో మాజీ హోంమంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా పాల్మాకుల పీఏసీఎస్ చైర్మన్ కె. శ్రవణ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సీనియర్‌నాయకులు కృష్ణగౌడ్, రవినాయక్, శ్రీనివాస్‌రెడ్డి, అంజనేయులు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మంచాల : ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని ఆరుట్లలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ రాష్ట్ర నేతలు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ముచ్చర్ల వెంకటేష్ యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, వెదిరె హన్మంత్‌రెడ్డి, మావిళ్ల వెంకటేష్, వాజిద్, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుంది

ఆమనగల్లు/మాడ్గుల, ఏప్రిల్ 22 : లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను పార్టీ శ్రేణులు ఎండగట్టి ప్రజలను చైతన్యం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పట్టణంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆమనగల్లు ,తలకొండపల్లి మండలాల్లో రేపు బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ చేపట్టే రోడ్ షో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు ఆమనగల్లు మండల కేంద్రంలో, 11 నుంచి 4 గంటల వరకు తలకొండపల్లిలో జరుగుతుందని చెప్పారు. సాయంత్రం 7 నుంచి మాడ్గుల మండలంలో రోడ్ షో నిర్వహిస్తున్నట్లు టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్‌షోలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో జడ్పీటీసీ అనురాధపత్యనాయక్, ఎంపీటీసీ దోనాదుల కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్ రావు, మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యనాయక్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి



సర్టిఫికెట్లు అందిస్తున్న ఏజీఎం

శంకర్‌పల్లి, ఏప్రిల్ 22 : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో, పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని నారాయణ హై స్కూల్ ఏజీఎం మల్లి కుమార్ సూచించారు. శంకర్‌పల్లిలోని ఆ స్కూల్‌లో సోమవారం ఈ కిడ్స్, ఈ చాంప్స్ గ్రాడ్యుయేట్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు తల్లిదండ్రులు మరింతగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్ డి స్వాతి లక్ష్మి, ప్రిన్సిపాల్ దివ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఎంపిక

మాడ్గుల, ఏప్రిల్ 22 : మండలంలోని కలకొండ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న 8 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలో 5వ తరగతికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామలింగం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను వారి తల్లి తండ్రులను ఆయన అభినందించారు.

వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు



బస్సులో సోదాలు చేస్తున్న పోలీసులు

యాచారం, ఏప్రిల్ 22 : మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. సీఐ శంకర్‌కుమార్, ఎస్సైలు వెంకటనారాయణ, గోపాల్, సత్యనారాయణలు వాహనాలు, ఆర్టీసీ బస్సులను కూడా తనిఖీ చేశారు. రూ.50వేల కన్నా ఎక్కువ నగదు ఉంటే, తగిన ఆధారాలు చూపించాలని, లేదంటే సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని చెప్పారు.

ప్రలోభాలతో అధికారంలోకొచ్చిన కాంగ్రెస్

తలకొండపల్లి, ఏప్రిల్ 22 : ప్రలోభాలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల భ్రమలు తొలిగిపోయాయని, మోసపోయామని ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారని చెప్పారు. రేపు ఉదయం 10 గంటలకు మండలంలో బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ అభ్యర్థి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ రోడ్ షో కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి రాజీనామా

యాచారం, ఏప్రిల్ 22 : మండలంలోని మంతన్‌గౌరెల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్ సోమవారం తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు అధికారులకు సమర్పించిన రాజీనామా పత్రంలో తెలిపారు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో జూన్ నాటికి మరి కొంత మంది కార్యదర్శులు రాజీనామా చేయనున్నట్లు సమాచారం.

యువమోర్చా జిల్లా కార్యదర్శిగా ఉదయ్ కుమార్ గౌడ్

కేశంపేట, ఏప్రిల్ 22: బీజేపీ యువమోర్చా జిల్లా కార్యదర్శిగా కొండారెడ్డిపల్లికి చెందిన కానం ఉదయ్ కుమార్ గౌడ్‌ను నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు టి. యాదీష్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఉదయ్ కుమార్ గౌడ్‌కు ఆయన నియమాక పత్రం అందించారు. తన నియమాకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహా రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్యలకు ఉదయ్ కృతజ్ఞతలు తెలిపారు.

మహేందర్‌గౌడ్ ఆశయ సాధనకు కృషి

మంచాల, ఏప్రిల్ 22 : బీజేపీ మంచాల మండల మాజీ అధ్యక్షుడు మునుకుంట్ల మహేందర్‌గౌడ్ ఆశయ సాధనకు కృషి చేస్తామని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు బోసపల్లి ప్రతాప్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, కొత్త అశోక్‌గౌడ్ అన్నారు. మహేందర్‌గౌడ్ 19వ వర్ధంతి సందర్భంగా సోమవారం తాళ్లపల్లిగూడలోని మహేందర్‌గౌడ్ విగ్రహానికి ఆ పార్టీ నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు పాండాల జంగయ్యగౌడ్, దన్నెబాషయ్య, కొంగర జనార్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆసరాగా అంబలి కేంద్రాలు



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కడ్తాల్, ఏప్రిల్ 22 :బాట సారులకు అంబలి కేంద్రాలు, చలివేంద్రాలు దాహార్తిని, తీర్చి ఆసరాగా నిలుస్తాయని ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బీక్యానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం ఎదుట లయన్స్‌క్లబ్, ప్యాక్స్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డితో కలిసి వారు ప్రారంభించారు. మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, బీచ్యనాయక్, జహంగీర్‌అలీ, పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే

చేవెళ్ల, ఏప్రిల్ 22 : ఆత్మరక్షణకు కరాటే చాలా ఉపయోగపడుతుందని సత్యసాయి పాఠశాల ప్రిన్సిపాల్ స్నేహలత అన్నారు. మండల కేంద్రంలోని ఆ పాఠశాలలో విద్యార్థులకు కుంగ్-ఫూ, కరాటే పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పంచెస్, కిక్స్, కటాస్ రఫూం ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ వెంకటేశ్, బలరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రైతులకు వీడియో కాన్ఫరెన్స్

మొయినాబాద్, ఏప్రిల్ 22 : నేడు మండల కేంద్రంలోని రైతు వేదికలో రాజేంద్ర నగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లతో రైతులకు వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి రాగమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరి, మామిడి, ఇతర పంటల సాగుపై రైతు నేస్తం ద్వారా ఈ వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని ఆమె చెప్పారు.

క్రైం కార్నర్

చెట్టుకు ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



ప్రవీణ్ మృతదేహం

కొత్తూర్, ఏప్రిల్ 22 : కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిద్దాపూర్ గ్రామానికి చెందిన గుండెమోని ప్రవీణ్(27) అనే ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై జి. శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రవీణ్ సోమవారం ఉదయం వరకు ఇంటికి రాలేదని చెప్పారు. అతని తండ్రి అంజయ్య వ్యవసాయ పొలం వద్దకు వెళ్లగా అక్కడ ప్రవీణ్ చింతచెట్టుకు వేలాడుతూ కనిపించడంతో, చుట్టుపక్కల వారిని పిలిపించి, ప్రవీణ్‌ను కిందక దించగా అప్పటికే అతను మృతిచెంది ఉన్నాడని అన్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా అతని మృతికి కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు. మృతుడి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

వైద్యం సరిగా అందక వృద్ధుడి మృతి

● ఆస్పత్రి ఎదుట మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్‌లో) మృతదేహం

శంకర్‌పల్లి, ఏప్రిల్ 22 : వైద్యం సరిగా అందకపోవడంతో షేక్ మోయినుద్దీన్(80) అనే వృద్ధుడు మృతి చెందాడని ఆరోపిస్తూ అతని కుటుంబసభ్యులు శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. పూర్తి వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని మహలింగాపురం గ్రామానికి చెందిన మోయినుద్దీన్ అనే వృద్ధుడు మహమ్మద్ ఖాన్ అనే తన బంధువుతో కలసి ఆదివారం సాయంత్రం తన ఇంటి ముందుకు కూర్చున్నాడు. అదే గ్రామానికి చెందిన నందీశ్వర్ అనే వ్యక్తి వేగంగా కారు నడుపుతూ వారిని ఢీకొట్టాడు. దీంతో వారికి గాయాలు కాగా కుటుంబ సభ్యులు వెంటనే శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్యం చేస్తుండగానే మోయినుద్దీన్ మృతి చెందాడు. దాంతో అతని కుటుంబ సభ్యులు విలపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడి నచ్చజెప్పారు. అనంతరం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ వ్యాన్ ఢీకొని ఒకరు..

శంషాబాద్ రూరల్ 22 : స్కూల్ వ్యాన్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాబాద్ రోడ్డులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మల్కారం గ్రామానికి చెందిన ధార కృష్ణయ్య(55) శంషాబాద్‌లోని షాబాద్ వెళ్లే దారిలో రోడ్డుదాటుతున్నాడు. ఇంతలో బ్రిలియంట్ పాఠశాలకు చెందిన ఏపీ 23 షె 9593 నెంబర్ గల వ్యాన్ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడం వల్ల కృష్ణయ్యను ఢీకొట్టాడు. ఆయనకు తీవ్ర గాయలవడంతో పోలీసులు చికిత్స కోసం సన్‌రైజ్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

చికిత్స పొందుతూ ఒకరు..

షాబాద్, ఏప్రిల్ 22 : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి అంతారం గ్రామంలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు అంతారంకు చెందిన ఎడ్లకాడి నర్సింహులు(36) గ్రామంలో డ్రిప్ పైపులు దొంగతనం చేశాడు. మరుసటి రోజు ఓ కోడిని దొంగతనం చేశాడు. గ్రామస్థులు కోడి కోసం అతని ఇంట్లో చూడగా డ్రిప్ పైపులు కనిపించాయి. దొంగతనం గురించి గ్రామంలో తెలిస్తే పరువుపోతుందని ఈ నెల 20న నర్సింహులు పురుగుల మందు తాగాడు. నగరంలో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమతి లేకుండా విక్రయిస్తున్న మద్యం పట్టివేత

యాచారం, ఏప్రిల్ 22 : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం యాచారం సీఐ శంకర్‌కుమార్ దాడులు చేసి రూ. మూడు వేల విలువైన మద్యాన్ని పట్టుకున్నారు. గ్రామానికి చెందిన యాదయ్య అనే వ్యక్తి ఇంట్లో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారమందడంతో దాడి చేసి మద్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

కుక్కల దాడిలో 15 మేకలు మృతి

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 22 : ఫరూఖ్‌నగర్ మండలం కొండన్నగూడ గ్రామంలో ఆదివారం ఓ మేకల మందపై కుక్కలు దాడి చేయడంతో 15 మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన గున్న మల్లయ్య అనే వ్యక్తి తన 15 మేకలను దొడ్డిలో కొట్టి ఇంటికి వెళ్లాడు. రాత్రి కుక్కలు మందపై దాడి చేసి మేకలను చంపేశాయి. మేకల విలువ సుమారు రూ.లక్షన్నర ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

పిడుగుపాటుకు రెండు గేదెలు..

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 22 : పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి చెందిన ఘటన చిన్నమంగళారం గ్రామంలో జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం ఆ గ్రామానికి చెందిన గునుగుర్తి సత్యనారాయణగౌడ్ అనే రైతు ఆదివారం సాయంత్రం చేనువద్ద గేదెలను కట్టేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి కురిసిన వర్షానికి తోడు వాటిపై పిడుగు పడడంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

రైతు భూమి ఆక్రమణకు రియల్టర్ యత్నం

● బాధితురాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

శంషాబాద్ రూరల్ ఏప్రిల్ 22 : మండల పరిధిలోని పెద్దతూప్ర గ్రామంలోని సర్వే నెంబరు 106/ఈలో 4 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, దానిలో తనకు చెందిన 1.17 ఎకరాల భూమిని ఆక్రమించడానికి ఓ రియల్టర్ యత్నిస్తున్నారని బాధితురాలు చెక్కల సుజాత అనే మహిళా రైతు ఆరోపించారు. సోమవారం జేజీబీలు, ట్రాక్టర్లతో తన భూమిని చదును చేయడానికి యత్నించారని చెప్పారు. నగరానికి చెందిన చంద్రశేఖర్‌రావు అనే వ్యక్తి మహాద్రి టౌన్ షిప్ పేరిట 30 ఎకరాల వెంచర్ వేశారని, తన భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. సర్వే చేస్తే ఎవరి భూమి ఎంత ఉందో తెలుస్తోందని చెప్పినా సర్వే చేయనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. తన భూమిని అమ్మాలని లేదంటే, ఆక్రమించుకుంటామని బ్రోకర్లు, చంద్రశేఖర్‌రావు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆమె వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు స్పందించి న్యాయం చేయకుంటే కలెక్టర్, సైబరాబాద్ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. పై విషయంపై శంషాబాద్ సీఐ నరేందర్‌రెడ్డిని ఫోన్లో వివరణ కోరేందుకు యత్నించగా అయన స్పందించలేదు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 22 : ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ప్రశాంతమైన వాతవరణంలో పండుగలను జరుపుకోవాలని మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. హనుమాన్ జయంతి సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవాలయం నుంచి మండల కేంద్రంలోని శివాలయం వరకు భజ్‌రంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించే వీరహనుమాన్ శోభయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన భజ్‌రంగ్‌దళ్ నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆవిష్కరించారు. నేడు జరిగే శోభయాత్రకు ఏసీపీ కార్యాలయం నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భజ్‌రంగ్‌దళ్ మండల ప్రముఖ్ వడ్ల రమేష్ చారి, గోరక్ష ప్రముఖ్ మల్లేష్ యాదవ్ నాయకులు ఉన్నారు.